క్లుప్తంగా

దత్త బాలసుబ్రహ్మణ్యస్వామికి దీపోత్సవం



బాదంపూడి ఆలయంలో దీపోత్సవ దృశ్యం

ఉంగుటూరు: బాదంపూడి దత్త బాలసుబ్రహమణ్యస్వామి ఆలయంలో సోమవారం దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యస్వామికి, విజయ వినాయకునికి, దత్తాత్రేయుడుకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాసరావు ఏర్పాట్లను పరిశీలించారు.

వైభవంగా బీరయ్య స్వామి ఊరేగింపు

దెందులూరు: సోమవరప్పాడులో బీరయ్య స్వామికి సోమవారం భక్తిశ్రద్ధతలో పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ వివిధ రకాల పుష్పాలతో స్వామికి అలంకరణ చేశారు. భక్తులు ప్రదక్షిణలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌పై స్వామివారిని సోమవరప్పాడు గ్రామంలో ఊరేగించారు.

మదర్‌థెరిస్సా ఆశయ సాధనకు కృషి



కాశిపాడులో మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

గణపవరం: మదర్ థెరిస్సా చేసిన సేవలు అమూల్యమైనవని, ఆమె ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడమే ఆమెకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు అన్నారు. సోమవారం మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా గణపవరం మండలం కాశిపాడులోని ఆరోగ్య ఉపకేంద్ర వద్ద మదర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహ దాత కోట ఆదినారాయణ, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, పంచాయతీ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుష్టు రోగులకు ఉచితంగా మందులు అందజేశారు.

రైతులకు మినీ గోకులం షెడ్ల బిల్లులు చెల్లించాలి



ఎ.గోకవరం మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరావు

ఉంగుటూరు: రైతులకు మినీ గోకులం షెడ్ల బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సోమవారం ఎ.గోకవరంలో రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించి పెండింగ్‌లో ఉన్న గోకులం షెడ్ల బకాయిలు పాడిరైతులు చెల్లించాలని కోరారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో వేలాది షెడ్లుకు పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించలేదన్నారు. రైతులు తమ వాటాగా ఇచ్చిన సొమ్ములు కూడా పశుసంవర్ధకశాఖ వద్దనే ఉన్నాయని శ్రీనివాసరావు వివరించారు. ధాన్యం కొనుగోలులో మెరుగైన విధానం తీసుకురావాలని కోరారు. ఏపీ రైతు సంఘం సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, మండల నాయకులు తమ్మినీడి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లాలో జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్‌సేఫ్టీ మొబైల్ బృందాలు అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎస్పీ శ్రావణ్‌కుమార్ అన్నారు. ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ కార్యాలయం వద్ద రోడ్‌సేఫ్టీ మొబల్ అధికారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను సమీపంలోని హాస్పిటల్స్ తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏలూరు ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు, టీడీఆర్‌బీ మధు, సిబ్బంది ఉన్నారు.

27, 28 తేదీల్లో క్రీడాపోటీలు

ఏలూరు రూరల్ : ఈ నెల 29 జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఆటల పోటీల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులు, యువతీ, యువకులు పాల్గొనాలని డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో క్రీడాకారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఫిట్ ఇండియా మొబైల్ యాప్ ద్వారా విద్యార్థులకు ఆరోగ్యం, వ్యాయామం పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు 27, 28 తేదీల్లో ఏలూరులో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.



దోషులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలి. పగలు, రాత్రి తేడా లేకుండా ప్రజా సేవకు అంకితమై విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందికి కనీస రక్షణ లేకపోవడం దారుణం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వైద్యులకు భద్రత కల్పించడం అందరి బాధ్యతగా గుర్తించాలి. ఆ దిశగా ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పించాలి.

– డాక్టర్ ఎల్ శ్రీనివాసరావు ఆయుర్వేద వైద్యాధికారి కొప్పాక

బహిరంగంగా ఉరితీయాలి



మహిళలపై నానాటికీ దాడులు పెరిగిపోతున్నాయి. వీటిని అరికట్టాలంటే నిందితులకు వేసే శిక్షలు భయంకరంగా ఉండాలి. అసలు తప్పు చేయాలన్న ఊహ రావడానికే భయపడేలా శిక్ష ఉండాలి. దోషులను బహిరంగా ఉరితీయడం, లేదా బహిరంగంగా కాల్చిచంపడం చేయాలి. నిందితులను జైళ్లలో పెట్టి ఏళ్లపాటు సకల సౌకర్యాలతో పోషించడం సరికాదు. కార్యాలయాల్లో, ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తించే మహిళలకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలి. – డాక్టర్ మాధవి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెదవేగి

పల్లెల్లో పారిశుద్ధ్యం అధ్వానం

- చినుకుపడితే.. మురుగు ముంచేస్తోంది
- నిర్వహణలేక డ్రెయినేజీల్లో పేరుకుపోతున్న మురుగు
- ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త
- రోడ్ల పక్కన స్వాగతం పలుకుతున్న చెత్తకుప్పలు
- దుర్వాసన, దోమలతో గ్రామీణుల ఇబ్బందులు



ఉంగుటూరు: నారాయణపురం- గణపవరం రహదారిలో రోడ్డుపక్కనే చెత్త



నిడమర్రు: బువ్వనపల్లి కాలనీలోని డ్రెయినేజీ దుస్థితి



దెందులూరు:వాటర్ ట్యాంకు పక్కన పూడుకుపోయిన డ్రెయిన్



నిడమర్రు: అడవికొలనులో రోడ్డుపైనే మురుగునీరు

నిడమర్రు/ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాల్లో డ్రెనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగు కాలువల్లో చెత్తా చెదారం పేరుకు పోవడంతో మురుగు ఎగదన్నుతోంది. చిన్నపాటి వర్షానికే డ్రెయిన్లలోని మురుగు నీరు రోడ్లలపైకి చేరుకోవడంతో రోడ్డంతా దుర్వాసన వెదజల్లుతోంది. ప్రధానంగా క్రొవ్విడి, అడవి కొలను, బువ్వనపల్లి, నిడమర్రు, పెదనింద్రకొలను, తోకలపల్లి గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. బువ్వనపల్లి ఇందిరమ్మ కాలనీలో ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి ఉందని స్థానికులు అంటున్నారు. నిడమర్రులోని పోలీస్ స్టేషన్ ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరుపక్కలా కచ్చా డ్రెయిన్లు పిచ్చిమొక్కలతో నిండిపోయి మురుగునీరు ముందుకు కదిలే పరిస్థితి లేక రహదారిపై ఎగదన్నుతోంది. ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు, కైకరం వంటి మేజరు పంచాయతీల్లో కొన్ని వీధుల్లో రోడ్లు వెంబడి మురుగునీరు పారకపోగా, చెత్త ఎక్కడికక్కడ దర్శనమిస్తోంది. బాదంపూడి వెల్లమిల్లి, నాచుగుంట, నీలాద్రిపురం, నల్లమాడు, గోకవరం వంటి పంచాయతీల్లో డ్రెనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉంగుటూరు మండలంలో ఓ గ్రామంలో డెంగీ జ్వరంతో యువకుడు ఒకరు చనిపోవడంతో ఆరోగ్య శాఖ సిబ్బంది మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇంటింటా జ్వరాల సర్వే చేశారు. దోమల విజృంభణ వల్ల ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీలను శుభ్రం చేయించి మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు చేపట్టాని గ్రామస్తులు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ

దెందులూరు: మండల, నియోజకవర్గ ముఖ్య కేంద్రమైన దెందులూరులో ప్రతిరోజూ గ్రామ, మండల, జిల్లాస్థాయి అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. మేజర్ పంచాయతీ అయిన దెందులూరులో పారిశుధ్య సిబ్బంది పర్యవేక్షణ చేయడానికి గ్రామ కార్యదర్శులు నలుగురు, వారిపై ఈఓపీఆర్‌డీ, ఎంపీడీఓ ఉన్నారు. అధికారులందరూ ఉన్న దెందులూరులో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఉన్నత పాఠశాల గోడకు అనుకుని వ్యాపారులు, స్థానిక నివాసితులు, ప్లాస్టిక్ వ్యర్థాపదార్థాలు వేస్తున్నారు. దీంతో మధ్యాహ్న భోజనం సమయంలో ఈగలు, దోమల కారణంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్ సెంటరులో వాటర్ ట్యాంకు పక్కన, డ్రెయిన్లల్లో వ్యర్థ పదార్థాలు పేరుకుపోయి మురుగునీరు కిందికి పారడం లేదు. నియోజకవర్గంలోని పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల్లో గ్రామాల్లోనూ డ్రెయిన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి.



నిడమర్రు: పోలీస్ స్టేషన్ రహదారిలో పూడుకుపోయిన డ్రెయిన్



ఉంగుటూరు: తహసీల్దారు కార్యాలయం ఎదుట నిల్వ ఉన్న నీరు



దెందులూరు: ఉన్నత పాఠశాల గోడ పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు



ఉంగుటూరు: రైల్వే కొలను టూరింగ్ పేటలోని డ్రెయిన్

చినుకు పడితే రోడ్ల పైకి మురుగు నీరు



కొద్దిపాటి వర్షానికే మా సత్య నారాయణపురం కాలనీ పూర్తిగా కచ్చాడ్రెయిన్లలోని మురుగు ఎగదన్ని రోడ్లపైకి మురుగునీరు చేరుతోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పక్కాడ్రెయినేజీ లేకపోవడంతో కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

–పోలిరెడ్డి వెంకట సత్యానారాయణ, అడవికొలను

సిబ్బంది పట్టించుకోలేదు



కాలనీలో చివరి డ్రెయిన్లను మాత్రమే పంచాయతీ సిబ్బంది క్లీన్ చేస్తున్నారు. ప్రధాన రోడ్డుపక్కన అనుకుని ఉన్న డ్రెయిన్లలను క్లీన్ చేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పంచాయితీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. రాత్రి వేళల్లో దోమలతో చిన్నపిల్లలు, మేము ఇబ్బందులు పడుతున్నాం.

–అలుమోలు కరుణ, బువ్వనపల్లి కాలనీ

ఉపాధి హామీ పథకంలో గుర్తించాలి



కాలనీలో డ్రెయినేజీ క్లీన్ చెయ్యడానికి అనేక సార్లు పంచాయతీకి చెపితే కానీ సిబ్బంది రావడంలేదు. ఉపాధి హామీ పథకంలో కాలనీలోని కచ్చా డ్రెయిన్లలోని పూడిక తీసి, మరోసారి తవ్వించేలా అధికారులు కృషి చెయ్యాలి. 7 ఏళ్లుగా ఈ డ్రెయినేజీలతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

– పచ్చాదుర్గా ప్రసాద్, బువ్వనపల్లి కాలనీ

వ్యక్తి అంతర్గత శక్తులను వెలికితీసేదే విద్య

ఘనంగా సెయింట్ జాన్స్ కళాశాల రజతోత్సవం



సోమవరప్పాడు సెయింట్ జాన్స్ కళాశాలలో మాట్లాడుతున్న పీఠాధిపతి పొలిమేర జయరావు

దెందులూరు: వ్యక్తి అంతర్గత శక్తులను వెలికితీసి బహిరంగ పరిచే శక్తి విద్యకు ఉందని ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి, సెయింట్ జాన్స్ విద్యా సంస్థల చైర్మన్ పొలిమేర జయరావు అన్నారు. సోమవారం సోమవరప్పాడు సెయింట్ జాన్స్ విద్యా సంస్థల రజతోత్సవ వేడుకల్లో ప్రిన్సిపల్, కరస్పాండెంట్, ఏలూరు పీఠాధిపతి వికార్ జనరల్ డాక్టర్ పి. బాల అధ్యక్షతన నిర్వహించారు. పీఠాధిపతి, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానియేలు, డెంటల్ కాలేజీ కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్, అమలోద్భవి రెక్టార్ ఫాదర్ మైఖేల్, ఫాదర్ బాల జ్యోతి ప్రజ్వలన చేశారు. కళాశాలలో విద్యనభ్యసించిన 35 మంది విద్యార్థులకు బీఈడీ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. జయరావును ఫాదర్ బాల, ఫాదర్ ఇమ్మానియేలు, ఫాదర్ మైఖేల్, ఫాదర్ మోజెస్, అధ్యాపకులను కళాశాల సిబ్బంది ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. రజతోత్సవ వేడుకల్లో పలువురు ఫాదర్లు, సిస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

దెందులూరు వద్ద ఫ్లైఓవర్ నిర్మించండి



దెందులూరు రైల్వే గేటు

దెందులూరు: ఏలూరు నుంచి దెందులూరు మీదుగా ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి వెళ్లడానికి దశాబ్దాలుగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దెందులూరు రైల్వేగేటు వద్ద ఫ్లై ఓవర్ ఏర్పాటు చేయాలని ప్రతిరోజూ దేవాలయానికి వెళ్లే భక్తులు ఏలూరు నుంచి ద్వారకాతిరుమల మధ్య ఉన్న గ్రామాల ప్రజలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ నిర్మించాలని, ఫ్లై ఓవర్ సాధన సమితి కమిటీ చైర్మన్ మద్దా భూషణం నిరసనలు తెలుపుతూ వినతిపత్రాలు అందిస్తున్నారు. రోజుకి 20 సార్లు గేటు పడటం, సింగిల్ రోడ్డు కావడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా ఉందని ఆయన అన్నారు. ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి భక్తులు పెరిగిన దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం దెందులూరు గేటు వద్ద మినీ ఫ్లై ఓవర్ నిర్మించాలని ప్రజాప్రతినిధులు ఆ దిశగా కృషి చేయాలని మద్దా భూషణం కోరారు.

వేధింపులతోనే న్యాయవాది కార్తీక్ మృతి

ఏలూరు (టూటౌన్): భార్యతో పాటు అత్తింటి వారి వేధింపుల వల్లే న్యాయవాది పయనం కార్తీక్ అనారోగ్యానికి గురై మరణించాడని దళిత నాయకులు, న్యాయవాదులు, కార్తీక్ తల్లిదండ్రులు ఆరోపించారు. ఏలూరు శంకర మఠం వీధిలోని కార్తీక్ పెద్ద కర్మ కార్యక్రమం వద్ద సోమవారం హైకోర్టు న్యాయవాది వి.ఉదయ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు సబవరాజు, ఏలూరు బార్ అసోసియేషన్ న్యాయవాది జీఈ డానియేల్, ఎంఆర్‌పీఎస్ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, కార్తీక్ తండ్రి రత్నరాజు మాట్లాడారు. ఏలూరు శంకరమఠం వీధిలో కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న న్యాయవాది పయనం రత్నరాజు గతంలో హైదరాబాద్‌లో ఉండగా అతని కుమారుడు పయనం కార్తీక్ మల్కాజ్‌గిరికి చెందిన మనిషా ప్రియా యాదవ్ అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడన్నారు. ఆరేళ్ల తర్వాత మనీషా ప్రియా యాదవ్ తండ్రి మరణించడంతో హైదరాబాద్ వెళ్లి నాటి నుంచి ఆమె తిరిగి రాలేదని తెలిపారు. ఆమెతో పాటు అత్తింటి వారు కార్తీక్‌ను వేధించారని, హైదరాబాద్‌లో వరకట్న వేధింపుల కేసు పెట్టి ఏలూరు టూటౌన్ పోలీసులకు రిఫర్ చేయించారని వివరించారు. పోలీసులు దర్యాప్తులో విఫలమయ్యారని ఆరోపించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

వాడవాడలా ఉత్సాహంగా ఉట్టి కొట్టిన యువత



భీమడోలు : పూళ్ల కృష్ణా కాలనీలో ఉట్టి కొడుతున్న యువత



గణపవరం: పాఠశాలలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

భీమడోలు: శ్రీకృష్ణాజన్మాష్టమి పర్వదినాన్ని వాడవాడలా సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని శ్రీకృష్ణుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం గ్రామాల్లో ఉట్టికొట్టేందుకు చిన్నారుల నుంచి పెద్దల వరకూ పోటీ పడ్డారు. ఉట్టిని కొట్టిన విజేలతకు కమిటీ సభ్యులు విలువైన బహుమతులు అందించారు. పల్లెల్లో పాటు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉట్టి కట్టే కార్యక్రమాలను నిర్వహించారు. పిల్లలు కృష్ణుని అలంకరణలో ఆకట్టుకున్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, పోలసానిపల్లి, సూరప్పగూడెం, లంక గ్రామాల్లో యువత ఉత్సాహంతో ఉట్టికొట్టారు. భీమడోలు గణపతి సెంటర్, శ్రీస్వాతి సెంటర్, పూళ్ల కృష్ణా కాలనీలో యువత ఉట్టికొట్టారు. గుండుగొలనులోని యాదవ సంఘం ఆధ్వర్యంలో సందరంగా ముస్తాబైన ట్రాక్టర్‌పై శ్రీకృష్ణునిని ఊరేగించారు.

యువత సందడి

నిడమర్రు: బువ్వనపల్లిలోని కృష్ణుని ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బువ్వనపల్లి జగ్గయ్య చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఉట్టిని కొట్టిన విజేతలకు రూ.8 వేలు విలువైన వెట్ గ్రైండర్ ప్రథమ బహుమతిగా, రూ. 6వేలు విలువైన సైకిల్ ద్వితీయ బహుమతిగా కమిటీ సభ్యులు అందించారు.

గ్రామాల్లో వేడుకలు

ఉంగుటూరు: కృష్ణాష్టమి సందర్భంగా ఉంగుటూరు, నారాయనపురం, చేబ్రోలు, కై కరం, బాదంపూడి, వెల్లమిల్లి, నాచుగుంట, నీలాద్రిపురం, నల్లమాడు, యర్రమిల్లిపాడు, గొల్లగూడెం, బొమ్మిడి,రాచూరు, ఎ.గోకవరం, గోపాలపురం పంచాయతీల్లో ఉట్టి కొట్టే ఉత్సవాలు నిర్వహించారు. ఉట్టి కొట్టేందుకు యువతీ యువకుల పోటీ పడ్డారు.

పెదపాడు మండలంలో..

పెదపాడు: మండలంలోని తోటగూడెం, కొత్తూరు, వట్లూరు గురుకుల పాఠశాల వద్ద కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తోటగూడెం గ్రామంలోని రామాలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వట్లూరులోని డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి పర్యవేక్షించారు. కొత్తూరు రామాలయం సెంటర్‌లో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

మేళతాళాలతో ఊరేగింపు

దెందులూరు: మండలంలోని కొవ్వలి, పోతునూరులో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.పోతునూరులో మేళతాళాలు, కోలాటంతో శ్రీ కృష్ణుడికి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి వేషధారణలో చిన్నారులను అలకరించారు.

విజేతలకు బహుమతులు

గణపవరం: గణపవరం, సరిపల్లె, పిప్పర, అర్ధవరం, కేశవరం, కొందేపాడు, గోపవరం, వాకపల్లి, ముగ్గుళ్ల, మొయ్యేరు, చిలకంపాడులో వీధి వీధినా ఉట్టికొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. గణపవరం వెలంపేట, బస్టాండు, తోట, చినరామచంద్రపురం, జగన్నాథపురం, పెద్ద వీధిలో ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. చిన్నారులు, యువకులు, మహిళలకు, పెద్దలకు వేర్వేరుగా ఉట్టికొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు అలరించారు.



నిడమర్రు: బువ్వనపల్లి శ్రీ కృష్ణుని ఆలయంలో పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



నిడమర్రు: బువ్వనపల్లిలో ఉట్టికొట్టిన విజేతలకు వెట్ గ్రైండర్, సైకిల్ అందిస్తున్న కమిటీ సభ్యులు